# వడదెబ్బ



"వెధవన్నర వెధవలు! నడుం వాల్చనియ్యరు. మీ మొహాలు మండా! వస్తున్నా నుండండి. మీ బుర్రలు బద్దలు కొడతాను." కోపంతో ఊగిపోతూ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ ముసిలాయన గేట్లోకి పరిగెట్టేడు.

గేటు సందుల్లోంచి చూస్తున్న పిల్లలంతా ఆయన గేటు దగ్గర కొచ్చేలోగా తుర్రుమన్నారు. ముసిలాయన తలుపు బార్లా తెరచి జాపోస్తూ నిల్చున్నాడు. పారిపోయిన పిల్లలు సందు మొగని తొంగి తొంగి చూస్తున్నారు.

బండ వెధవల్లారా! బడుద్దాయి గాడిదల్లారా! రండి మీ పని పడతా! ముసిలాయన గట్టిగా అరిచేడు.

ఎండాకాలం మధ్యాహ్నం. ఒళ్లు చిట చిట లాడుతోంది. నుదుటి మీంచి చెమట ధారకట్టి ఆయన మొహంమీద ముడతల్లోంచి కిందికి కారుతోంది. వీపంతా పేత పొక్కులతో గోనె గుడ్డలా దళసరి ఎక్కి పోయింది. వీధిలో మనిషన్న వాడు లేడు. అందరి ఇంటి తలుపులు బిడాయించుకుని ఉన్నాయి. గుంటవెధవలకి ఎండాలేదు కొండా లేదు' సందు మొగని నిల్చుని తొంగి తొంగి చూస్తున్నారు. ముసిలాయన ఎండలో నిల్చుని సందు వేపు తీక్షణంగా చూస్తున్నాడు. పిల్లలు ఏమను కొన్నారో ఏమో చల్లగాజారుకున్నారు.

"పోయారు వెధవలు! వారంరోజులై ఈ భాగోతం మొదల యింది. మధ్యాహ్నం కాస్త నడుం వాల్చనియ్యరు" ముసిలాయన గొణుక్కుంటూ గేటు వేసి ఇంట్లోకి వచ్చేడు. జాపోస్తూ పడక్కుర్చీలో పడుకున్నాడు. సరసారావు పేట పడక్కుర్చీ! వాంట్లో పడుకుంటే ప్రాణం సేద తీరుతుంది. ఆయన ఆకుర్చీని తన మొదటి జీతంతో కొనుక్కున్నాడు. చిన్నప్పటినుంచీ అలాంటికుర్చీ ఓటి ఉంటే బాగుం టుందని ఆయనకి మా కోరిగ్గా ఉండేది. మొదటి జీతం చేతికిరావడం

ఏమిటి కుర్చీకొండం ఏమిటి! రిటైరై కొడుకూ కోడలి దగ్గరకి పూర్తిగా వచ్చేస్తున్నప్పుడు మిగతాసామాన్లు వాళ్లకీ వీళ్లకీ పంచేడుకాని ఆకుర్చీని మాత్రం జాగ్రత్తగా తనతో కూడా తెచ్చుకున్నాడు.

"నాన్నగారూ! మీరూ మీ చాదస్తంగాని, ఆకుర్చీని అక్కడెవరి కన్నా ఇచ్చిలేకపోయారూ? అంత దూరంనుంచి ఇక్కడికి మోసు కొచ్చేరు!" అన్నాడు కొడుకు.

కొడుకేక్కం తెల్సు? ఈ కుర్చీలో ఉన్నసౌఖ్యం. ముసిలాయన కుర్చీకాళ్ల మీదకి రెండు కాళ్లూ జాపుకుని విసనకర్రతో విసురుకుంటూ కళ్లు మూసుకున్నాడు.

"తెల్లమీసం! తాటేకు విసనకర్ర! వెండిమీసం తాటేకు విసన కర్ర!" పిల్లలుమళ్లీ వొచ్చిపడ్డారు. నవ్వుతున్నారు. గేటుసందుల్లోంచి చూస్తున్నారు. ముసిలాయనకి తాటేకు విసనకర్రే గతిఅయింది. సీలింగు ఫేను లోపలిగదిలో ఉంది. కొడుకూకోడలూ అందులో ఉంటారు. ముందు గదిలో ఫేనులేదు. తండ్రి రిటైరై వచ్చేడని మరోఫేను కొడుకు వెంటనే ఎక్కడ కొంటాడూ? ఆదివారం సంతలో ముసిలాయన అరడజను విసనకర్రలు కొనుక్కు తెచ్చుకున్నాడు.

"తాటికమ్మా! తాటిముంజె! తెల్ల మీసం వెండిమీసం!" ముసిలా యన ఈసారి కుర్చీలోంచి లేవలేదు. కుర్చీలో పడుకునే గేటువేపు చూస్తూ ఊరుకున్నాడు. గేటు సందుల్లోంచి కొన్ని జతల కాళ్లు కని పిస్తున్నాయి. ఎర్రరంగు గౌను, నీలంరంగు రిబ్బను కన్పడుతున్నాయి. అన్ని కాళ్ళకి హవాయి చెప్పులు ఉన్నాయి. ఆకాళ్లలో బుల్లిగాడి కాళ్లు ఏవైఁ ఉంటాయో అని ముసిలాయన తేరిపారి చూసేడు. ఆ బుల్లి గాడు మాకానివెధవ! ఆవెధవే ఈ సజ్జునంతటినీ తీసుకొచ్చి గొడవ చేస్తున్నాడు. ఇదే తంతు. వెధవసన్నాసులకి భయం అన్నది ఏ కోశాన్నీ లేదు. మధ్యాహ్నం అయీ అవడంతో వొచ్చిపడ్డం— గేటు సందుల్లోంచి చూడ్డం. ఒకటా–రెండా–కాళ్లు! ఆరుగురో ఏనమండుగురో! బొత్తిగా

చిన్న వెధవలూ ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలూ ఉన్నారు. మొదటి రోజూ తిట్టేడు. కొడ్తానని కేకలేసేడు. ఎవరిపిల్లలని అదలించేడు. అన్నిటికీ పకపక నవ్వులే. ఆయన తిడుతున్న కొద్దీ వాళ్ళకి మరింత నవ్వు. "బుల్లిగా! బుల్లిగా!" అంటూ పరుగులు. నిన్నటికి నిన్న ముసిలాయనకి చిన్న మాగన్ను పట్టింది. "తాటిముంజెలండి! తాటిముంజెలండి!" చెవిలో కేకపడ్డాది. ముసిలాయన లేచి చూచున్నాడు. "ఏయ్ తాటి ముంజెలూ!" అని వరండాలోంచి కేకేసేడు. "ఏయ్ తాటి ముంజెలూ! ఏయ్ తాటి ముంజెలూ" అని పిలుస్తూనే ఉన్నాడు. తాటిముంజెల వాడి అరుపు దూరం అయిపోతూ సందు మొగనుంచి వినపడుతోంది. ఊడిపోతున్న పంచెని దోపుకుంటూ ముసిలాయన గేటువరకూ పరిగెట్టుకు వెళ్లేడు.

"తాటిముంజెలండోయ్! తాటి ముంజెలు! అరుపు వినపడుతోంది. ముసిలాయన వీధిని అటూ ఇటూ చూశాడు.

"ఏయ్ తాటిముంజెలూ!" అంటూ కేకేశాడు. సందు మొగనుంచి మళ్లీ "తాటిముంజెలండి తాటి ముంజెలు!" అని వినిపించింది ముసిలాయన అటు చూసేసరికి పిల్లలంతా గొల్లని నవ్వేరు. ఒకుర్రాడు ఏతాడి తాతలా 'తాటిముంజెలండి తాటిముంజెలు' అని అరుస్తున్నాడు. ముసిలాయనకి వెర్రి కోపం వచ్చింది. "దొంగవెధవల్లారా! సన్నాసివెధవల్లారా!" అని తిడుతూ వెర్రి పీరులా ఊగిపోతూ వీధంట పరిగెట్టేడు.

"బుల్లిగా! వచ్చేంరోయి!" అంటూ పిల్లలు పరుగులంకించుకున్నారు. అప్పుడు తెలిసింది 'బుల్లిగాడు' ఆ కుర్ర కుంకల లీడరుగాడని!

"అమ్మడూ! ఆ బుల్లిగాడెవరో నీకు తెల్సా?" అని కోడల్ని అడిగేడు.

కోడలు మా తల్లి తిన్నగా జవాబిస్తుందా? తను వచ్చిందగ్గర్నుంచి చూస్తున్నాడు. తన పొడ ఆవిడకి కిట్టటం లేదని తెలుస్తూనే ఉంది.

"ఏమో ఎవడికి తెల్సు? బుల్లిగాడో మల్లిగాడో! రోజూ న్యూసెన్సు! వాళ్లూనరి మీరూనరి! లక్షా తొంభైసార్లు చెప్పేను. తలుపులు వేసుకు

పడుకోండీ అని! ఉహూఁ మీరెక్కడ వింటారూ? పోనీ తలుపు వేసుకుంటే తీసుకున్నారు. అక్కడైనా ఉండనిస్తారా? వచ్చీచెడీ ఆ ఎంబ్రాయిడరీ చేసేను. సలిపిసలిపి తలుపు మీదికి ఎత్తి పడేస్తారు." కోడలు విసుక్కుంది.

ముసిలాయనకి తలుపులు బిడాయించుకోవడం, తెరగుడ్డలతో ఇల్లంతా చీకటిమయం చేసుకోవడం ససేమిరానచ్చదు. గాలీ వెలుతురూ రాకుండా, బైట ప్రపంచం కనపడకుండా ఉండటం ఆయనకిరాదు. ఆయన కొడుకు దగ్గరికి రావడం ఏమిటి, సావిడిగదిని తనదిగా చేసుకోడం. వీధి గుమ్మానికి ఎదురుగా సర్కారావుపేట పడక్కుర్చీ వేసుకోడం, దాంట్లోపడుకుని వీధివేపు చూస్తూ ఆకాశాన్ని చూస్తూ చుట్ట కాల్చుకోడం మొదలయింది. ఆయన బతుకు బతుకంతా బాహాటంగా బతికేడు. బతుకులో రహస్యమన్నది లేదు. ఆయన రాక పూర్వం అయితే వీధి తలుపులు వేసి ఉండేవి. అథవా తీసి ఉన్నా నిండా కర్టెను ఉండేది. ముసిలాయన వీధి తలుపులు బార్లా తెరపడమే కాదు—ఆ కర్టెను ఎత్తి తలుపుమీదకి పడేస్తాడు. అప్పటికిగాని ఆయనకి ఊపిరి తీసుకున్నట్టు ఉండదు.

ముసిలాయన చేసే పన్లతో తన యింటి డీసెన్సీ పోయిందని కోడలి బాధ. గుమ్మానికి ఎదురుగా అడ్డంగా అంభేరీలా ఈ గోడ నుంచి ఆ గోడ వరకూ ఇంత పొడుగుని ఆ పడక్కుర్చీ ఒకటి! దానికి తోడు కంపు ఆపుకోరా, తాటాకు విసనకర్రా! ముసిలాయనా ఆయనచుట్టాను. సందు దొరికితే చాలు ఆవిడ రుసరుస లాడుతూనేఉంది. మొగుడిలో ముప్ఫైసార్లైనా చెప్పి ఉంటుంది.

"ఎందుకు అలాతొందరపడ్తావు! చెప్తున్నానా! నీ కోరిక తీరుతుందన్నానా! ఎటొచ్చీ సీలింగు ఫేను మాత్రం ఇప్పుడురాదు. వేసంకాలం కదా! కొంచెం కష్టం. నీసోఫాసెట్టు వస్తుంది. నీ యిష్టం వచ్చినట్టూ నువ్వు ముందుగదిని డెకరేటు చేసుకుందువుగాని." అని మొగుడు ఎంతో

ముచ్చటగా చెప్పి ఆవిడ చీకాకుని పటాపంచెలు చేసేడు. మొగుడి చాకచక్యం మీద ఆవిడకి చాలా నమ్మకమే. అన్నాడూ అంటే చేసేడూ అన్నమాటే! ఎక్కడో ఏదో పాచిక పారేఉంటుంది. అందుకే అంత ఖచ్చితంగా కోరిక తీరుతుంది అంటున్నాడు.

ఇదిగో, వారం రోజులై పిల్లల సంతోకటి మొదలయింది. ఆ గుంట వెధవలు రావడం ముసిలాయన్ని వెక్కిరించడం—— ఈయన వెర్రెత్తి పరుగులు తీయటం—— ఆ పిల్లల తల్లి తండ్రులకైనా బుద్ధిలేదు. ఇంత ఎండల్లో పిల్లల్ని రోడ్డు మీదకి ఎలావదులుతారో! ఏ వడ దెబ్బో తగిలితే కాని తెలిసిరాదు. కోడలికి మహా చికాగ్గా ఉంది. ఈ వేళ పిల్లల గొడవ తారస్థాయిని అందుకుంది. ఒకటే రొదగా అరుస్తున్నారు. కోడలు విసురుగా వచ్చి వరండా మీద నిల్చుని వాళ్లని తిట్టింది. కోడిల్ని చూడగానే పిల్లలందరూ మాయమై పోయారు. ఆవిడ గేటు వరకూ అయినా వెళ్లలేదు. వీధివరండాలో ఆవిణ్ణి చూసి వాళ్లు హడలి పోయేరు. కోడలు విసవిసలాడుతూ ముసిలాయన పక్కనుంచి ఇంట్లోకి వెళ్లిపోయింది.

ముసిలాయన తిట్లు పిల్లలకి లెక్కలేదు. ఆయన తిడితే వాళ్లకి ఆనందం! పకపకానవ్వుతారు! పరిగెడతారు. ముసిలాయన దిగులుపడి పోయేడు. రోజురోజుకీ తను దిగజారిపోతున్నట్టుగా ఆయనకి ఆయనకే తెలుస్తోంది. పిల్లలు తనని చులకన చేసి ఆటపట్టిస్తున్నారని కాదు ఆయన బాధ! మొట్టమొదటిరోజు పిల్లలు గేటు సందులోంచి చూసినప్పుడు వాళ్లని ఆయనే ఉసిగొట్టి రెచ్చకొట్టేడు. ఆయన రెచ్చకొట్టినప్పుడు, తిట్టినప్పుడు పిల్లలకి నవ్వు వచ్చింది. ఆయన తిట్లు వాళ్లకి తిట్లలా అనిపించలేదు. ఆయన కేకలు ఉత్తుత్తి గావుకేకలే! పిల్లలకి అదో ఆట అయింది. ముసిలాయనకీ వాళ్ల ఆటలో ఏదో ఊరట కలుగుతోంది.

ముసిలాయనకి బాధగా ఉంది. తన బాధనీ, దిగులునీ ఎలా పోగొట్టుకోవాలో ఆయనకి బోధపట్టం లేదు.

ఆవేళ మనవల్ని సెలవల్లో ఎక్కడికీ పంపొద్దనీ వాళ్ళకి తను పాఠాలు చెప్తాననీ తనకి కాలక్షేపం అవుతుందనీ పిల్లలూ మెరుగవుతారనీ అన్నాడు. కోడలు ససేమిరా వినలేదు. కొడుకో? పెళ్ళాం ఎంత చెపితే అంత!

"ఎలాగా ట్యూషను పెడ్తాం. మీరేం చెప్తారూ?" అన్నదికోడలు.

"మీకెందుకండీ? రామాకృష్ణా అని రెస్టు తీసుకోక!" అన్నాడు కొడుకు.

"మీకు అక్కర్లేని విషయాల్లో జోక్యం కలగచేసుకోకండి. పిల్లలూ చదువుసంధ్యలూ వాటి ఊసు మీకెందుకూ? మేం వాళ్ళ మంచి చెడ్డా చూసుకోగలం" అని కోడలు కుండ బద్దలు కొట్టినట్టు చెప్పింది. ఎండాకాలం సెలవలు ఇచ్చీ ఇవ్వడం పిల్లలు వాళ్ల పిన్నిగారి ఊరు వెళ్లిపోయేరు.

పిల్లలు తిరగడానికి వెళ్లేరు. మంచిదే. అదికాదు ముసిలాయన కడుపులో బాధ. మాటకి విలువ ఉండాలే! కొడుకుని చూస్తూ ఉంటే ఆయనకి ఆశ్చర్యం వేస్తోంది. కళ్లెర్రచేసి చూస్తే బిక్కచచ్చి నిల్చునే వెధవ వీడేనా! ఆయనంటే వీడొక్కడేనా అదెంతహడిలి పోయేది? చచ్చి స్వర్గాన్న ఉంది. ఎంతభయమో! ఒదిగి ఒదిగి ఉండేది. ఆయనంటే ఒక్క పెళ్లానికేనా హడలు? ఆఫీసులోనో? అందరికీ గడగడే! భయపడకేం చేస్తారు? నిప్పులాంటి మనిషి. ఎవరిపప్పులూ ఆయన దగ్గర ఉడకవు. ఆయన్ని ఎప్రోచ్ అవడమే? బతుకు బతుకంతా అలాగే బతికేడు. పిల్లల చదువు విషయంలో తన జోక్యం పనికిరాదన్న వాళ్లనీ, వాళ్ల బతుకుల్ని తనేం దిద్దగలడు!

"మీకేమిటండీ! కొడుకు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు" అంతా అన్నారు.

ఆయనా అదే అనుకున్నాడు. రిటైరై కొడుకు దగ్గరికి వచ్చేక కన్నాడన్న మాటేకాని తనకే మాత్రం కొడుకురూపం తెలీదన్న నిజం ఆయనకి తెలిసివచ్చింది. ఆయనదే ఆసూది ముక్కు. ఆయనదే ఆగెడ్డం.

ఆయనదే ఆ ఉంగరాల జుట్టు. ఆయనదే ఆ మిసమిసలాడే తెలుపు. అన్నిటిలో ఆయన కొడుకేనని చూసినవాళ్లు ఆనవాలు కడతారు కాని ఆయన తనకొడుకులో తనను తాను ఆనవాలు పట్టుకోలేక పోతున్నాడు.

ఆడాబు దర్పం! అహంకారు! ఆగిరు! కింవామీదా కానిరాని కావరం! వాడా ఆయన కొడుకు? కొడుకు కన్నా నాలుగాకులు ఎక్కువ వల్లించే కోడలు! ఆ మా తల్లి నోట వచ్చే ప్రతి మాటలోనూ అతిశయమే!

కొడుకు పెద్ద ఉద్యోగంలో ఉన్నాడని సుఖంగా ఉన్నాడని అనుకున్నాడే కాని వాడి రూపం ఇలా మారి ఉందని ముసిలాయనకి ఏం తెల్సు? ఆయన తన ఉద్యోగంలో తాను ఉన్నాడు. కొడుకు ఈ దూర ప్రాంతాల్లో ఎలా రంగు మారి ఉన్నాడో ఆయనకేం ఎరుక? నిజమే. ఈ రోజుల్లో గాలి వాటం అలాగే ఉంది. అందరూ ఆ గాలిలో కొట్టుకు పోతున్నారు. అయితే వీడు - వీడు - ఈ కొడుకు గాలిలో కొట్టుకు పోతున్నారు. గాలికి ఎదురు వెళ్లాల్సిన వాడుకాదూ? తనకుపుట్టి!! 'ఆయన కేం? ఆయన కొడుకు రెండుచేతులా గడిస్తున్నాడు' అంటున్నారందరూ. రెండు చేతులా గడిస్తున్నాడా? దోస్తున్నాడా? ముసిలాయన లోలోపల కుంగిపోతున్నాడు.

వీధిలో గుంటవెధవలు. పసికుంకలు. ఆయన్ని ఆటపట్టిస్తున్నారని ఆయన బాధపట్టం లేదు. ఓ ఎకంగా ఈ వారం రోజులుబట్టి ఆ పిల్లలతో ఆయనకి కాలక్షేపం అవుతోంది. కడుపులో మండుతున్న మంటని ఆకుర్రకుంకల మీద చూపెడుతున్నాడు. తన దిగులుని తన బాధనీ పోగొట్టు కోడానికి తనకోపాన్ని ఆ పిల్లల మీద దుద్దుతున్నాడు. చెట్టంత కొడుకుని తిట్టడం ఎలాగో తెలీక ఆ కుర్ర వెధవల్ని దెదురుస్తున్నాడు. ప్రతిరోజూ ఆ పిల్లలు వచ్చేవేళకోసం ఆయన ఎదురు చూస్తూనే ఉన్నాడు. మాగన్ను పట్టబోతున్నా ఆ అకతాయి పిల్లలు ఇంకారాలేదేమో అను కుంటూ రెప్పలు బలవంతాన్ని విప్పి గేటు వేపుచూడ్డం ఆయనకి అల వాటే అయింది.

ఆ ఆదివారం ఆయనకి తిక్క ఎక్కిసట్లైంది. ఆయనకి ఇంట్లో ఉండ బుద్ధి పుట్టలేదు. ఆయన వీధిలో తిరగడానికి వెళ్లాడు. ఆవెళ్లిన వాడు సూర్యుడు నడినెత్తికి వచ్చేవరకూ ఇంటికి రాలేదు. ఎర్రగా కంద గడ్డలాంటి మొహంతో చెమటలు కక్కుకుంటూ ఎండపడి వచ్చేడు. ఆయన వచ్చేసరికి పక్కింటావిడా పిల్లలూ సావిట్లో ఉన్నారు. ముసిలాయన రావడం చూసి ఆవిడ వెళ్తానంటూ లేవబోయింది.

"పెద్దవారు; ఆయన దగ్గర మీకు మొహమాటం ఏమిటండీ?" అన్నాది కోడలు.

ముసిలాయనకి అంతా చీకటిగా కనిపించింది. కళ్ళు గట్టిగా మూసుకుని తెరిచి చూసేడు, తనపడక్కుర్చీ సావిట్లో లేదు...

"మరేనండి. ఇది సోఫా కమ్ బెడ్డేనండీ. ఎవరన్నా ఇంటికి వస్తే మహా ఇబ్బందిగా ఉందనుకోండి. ఇంటికొచ్చిన వాళ్లని కిందపడుకో పెట్టలేం కదా!" చెప్తోంది కోడలు.

"అసలే ఖరీదైన ఫర్నీచరు. అందులో ఇప్పుడుమరి ధరలు పెరిగిపోయాయి. మీరు కాబట్టి కొన్నారు. మాలాంటి వాళ్ల కొండమే!!" అన్నాది పక్కింటావిడ.

కోడలు ఓపెక్కు నవ్వునవ్వింది. ముసిలాయనకి కళ్లు బైర్లు కమ్మి నట్లుగా అనిపించింది. ఆయన నుదుటి మీద చెమటని చేత్తో తుడుచు కుంటూ మరోసారి గట్టిగా కళ్లమూసుకుని తెరిచాడు. పక్కింటావిడ పిల్లలలో వెళ్లిపోయింది.

ముసిలాయనకి కొత్త సోఫాసెట్టు నల్లగా జీమూతంలా అనించి. ఆయనకి తన పడక్కుర్చీలో పడుకోవాలనీ కంచు ఆపుకోరాడు మంచి నీళ్లు గటగటా తాగాలని ఉంది.

"సోఫాసెట్టు బాగుందా నాన్నగారూ! కూర్చోండి" లోపల్నుంచి కొడుకు వచ్చేడు.

సోఫాలో కూర్చోబడిపోయి "బాగుందిరా బాగుంది. ఎంతయిందీ!"

అన్నాడు ముసిలాయన. కొడుకూ కోడలూ మొహ మొహాలు చూసుకున్నారు.

"కాన్లేదండీ. మనకి ఉత్తినే వచ్చింది" తండ్రితో అబద్ధం ఆడలేదు. రక్తంలో ఆమాత్రం నిజాయితీ ఇంకా మిగిలి ఉంది.

"ఉత్తినే రావడం ఏమిటీ?" కళ్లు చిట్లించు కొంటూ అడిగేడు. సావిడంతా ఆయనకి చీకట్లు ముసిరి నట్లుగా అనుతోంది.

"మీరు ఉత్తి సత్తి కాలం వాళ్లండీ మావగారూ! ఉత్తినే రావడం అంటే మీకు అర్థం కాదు. పెద్దబిల్లు ఓటి పాసు చేయించేరట. దాంతో ఆ పెద్ద మనిషి మనకిది ఇచ్చేడు." మొగుడి ప్రయోజకత్వాన్ని చెప్తూ కోడలి మొహం మతాబాలా వెలిగింది.

నిప్పుల గాడ్పులో ఇంటికి వచ్చేడు. వస్తూనే నిప్పుల గుండంలో కూర్చొబడి పోయాడు. ముసిలాయన సర్రుమని లేచేడు. "నా పడక్కుర్చీ ఏదీ?" పెద్దగొంతుకతో బొబ్బపెట్టేడు.

'ఇక్కడెందుకూ? పాతడొక్కుది. అదిక్కడుంటే సావిడి అందం మరి అడగక్కర్లేదు. అదిగో చీడీ మీద పడేసాం.'

"ఏదీ నాకుర్చీ? చీడీమీద పడేసారూ? నాకుర్చీ ఉంటే సావిడి అందం పోతుందీ! ఓహో! అందం పోతుందా? చూస్తారేం? పారెయ్యండిరా! నన్నూ పారెయ్యండి."

వెర్రి కోపంతో రెచ్చిపోయి ముసిలాయన కళ్లు తెరుస్తూ మూస్తూ ఊగిపోతూ చీడీమీదకి వెళ్లేడు. హఠాత్తుగా ఆయన వేస్తున్న ఈ కేకలు విని కొడుకూ కోడలూ అట్టే ఉండిపోయేరు. పెద్ద పెద్ద అంగలతో చీడీమీంచి పడక్కుర్చీని జాపోస్తూ సావిట్లోకి తెచ్చేడు. పూనకం పట్టిన వాడిలా రెండు చేతుల్తో సోఫాని ఓపక్కకి లాగేసి తన పడక్కుర్చీని పడాలుస వేసేడు. పడక్కుర్చీలో పడి పోతున్న వాడిలా పడుకో బడి పోయేడు. ఆయనకి జాపోత ఎక్కువైంది.

"ఒరేయి! ఇది—ఈ కుర్చీ నేను చెమటోడ్చి కొన్నదిరా. ఇదిగో

ఈ కుర్చీలో ఉండే ఈ ప్రాణి బతుకులో చేతులు కడిపించుకోలేదు ఆహా! భ్రష్టువెధవా! ఈకుర్చీ ఉంటే నీఇంటి అందం పోతుందా? అమ్మ! హాయ్! ఇల్లట్రా? నీకొంప నీకొంప భ్రష్టు కొంప! భ్రష్టువెధవకి భ్రష్టు కొంపకి అందం ఏమిటిరా? ఒరేయి వెధవా! నీకొంపలో ఉంటే నాకుర్చీ చక్కదనం పోతుంది." ముసిలాయనకి ఆయాసం ఎక్కువైంది. జాపోస్తూ వెక్కుతూ, చెమటలు కారుతూ ఆయన విడుతున్నాడు. ఆయనకి అంతా చీకటిగా నల్లగా కనపడుతోంది. ఈహఠాత్పరిణామానికి కొడుకూ కోడలూ నోటమాట రాకుండా అలా నిలుచుండి పోయారు.

"ఒరేయి అప్రాచ్యుడా! నీకొంపలో నేను ఉండను. నాకుర్చీ ఉండదు. అమ్మా! అబ్బా!" ముసిలాయన వెక్కుతూ ఉంటే కొడుక్కి ముందు తెలివొచ్చింది. పెళ్లాన్ని కేకలేస్తూ · కంగారుగా మంచి నీళ్ళు ముసిలాయన మొహాన్ని చిలకరించి ఉపచారాలు చేసేడు గాని ముసిలి ప్రాణం హరీమంది.

"పెద్దవాడయి పోయేడా! ఇంటి పట్టున ఉండకూడదూ! ఎండలో తిరిగి తిరిగి వచ్చేట్ట. పెద్దప్రాణం. వడదెబ్బకి తట్టుకోలేక గుటుక్కుమంది, వీధి వీధంతా చెప్పుకున్నారు.

వెండి మీసాల్తాత, తెల్ల మీసాల్తాత. పడకుర్చీ తాత చచ్చిపోయాడని తెలిసి పిల్లలంతా ఒక్క చచ్చి పోయేరు.

"ఒరే బుల్లిగా! మనం ఎండలో ఆడుతూ తిరుగుతున్నాం కదా వడదెబ్బ కొట్టె మనమూ చచ్చి పోతామా?" అని ఓపిల్లడు బుల్లి గాణ్ణి అడిగేడు.

"ఆ వడ దెబ్బ మన పిల్లలకి కొట్టదు"అన్నాడు బుల్లిగాడు. అన్నీ తెలిసిన పెద్దవాడిలా!